# జ్ఞానోదయం

-కట్నేని వేంకట కృష్ణారావు

ఆఫీసులోకి అడుగు పెట్టానో లేదో అప్పిగాడు ఆందోళన నిండిన ముఖంతో హడావిడి పడిపోతూ ఎదురొచ్చి చెప్పాడు.

"మన సూపరింటెండెంటు నారాయణగార్కి ఆక్సిడెంటైందట. బాగా సీరియస్‌గా ఈ గంటో మరో గంటో అన్నట్లుందట పరిస్థితి. మన స్టాఫ్ అంతా మీ పర్మిషన్ తీసుకుని హాస్పిటల్‌కి పోయి చూసొద్దాం అనుకుంటున్నారు సార్"

ఒళ్ళు మండిపోయింది నాకు. ఏ వంక దొరుకుతుందా ఆఫీసుపని ఎగ్గొడదాం అనుకుంటుంటారు వీళ్ళు. ఆ నారాయణ మాత్రం ఏమన్నా చిన్నకుర్రాడా? రేపోమాపో రిటైరయ్యే వయసులో ఉన్నాడు. వాడు పోతే ఆఫీసు నుంచీ అన్ని ప్రయోజనాలూ వస్తాయి. ఇన్స్యూరెన్స్ లాంటివి చేసే ఉంటాడు. కాబట్టి ఆ లాభాలూ వస్తాయి. వీడి కొడుక్కో, కూతురుకో ఉద్యోగమూ వస్తుంది. వాడు చస్తే ఇన్ని లాభాలుండగా వీళ్ళు పోయి అక్కడ ఏడ్చేదేముంది. అందుకే 'ముందు ఆఫీసు పనులు చూసుకోండి' అనేసి అప్పిగాడి ముఖం కూడా చూడకుండా నా రూమ్‌లోకి పోయి కూర్చున్నాను.

ఏమనుకున్నారో ఏమోగానీ ఆ తర్వాత ఆఫీసు పనిమీద నారూంలోకి వచ్చిన స్టాఫ్ అందరి ముఖాలూ మాడిపోయే ఉన్నాయి. నమిలేసేలా చూస్తున్నారు నా వంక. అయితే నాకేం?

సాయంత్రం ఇంటికి పోయే ముందు కూడా నారాయణకి ఎలా ఉందో కనుక్కోలేదు నేను. అయినా వాడి గురించి వివరాలు తెలుసుకోవడానికి వాడేమైనా బిల్‌గేట్సా? ముఖేష్ అంబానీనా? కనీసం నా పై అధికారి కూడా కాదు.

ఇంటికెళ్ళేప్పటికి మా ఆవిడెందుకో తెగ విచారంగా ఉంది. కారణం అడుగుదామనుకునే ఆగిపోయాను.

మళ్ళీ ఏ పనికిమాలిన వాడి గురించో ఏడవటం ప్రారంభిస్తుంది. నాకసలే తెగ చిరాకు అలాంటివన్నీ.

రిలాక్సయ్యి. ఆవిడ అందించిన టిఫినూ కాఫీ లాగించేసి అలా ఆఫీసర్స్ క్లబ్ వరకూ పోయొచ్చేసరికి రాత్రి తొమ్మిదిన్నరవుతోంది. లోపలికొచ్చేసరికి మా ఆవిడ ముఖం కళకళలాడుతోంది. టి.వి.లో న్యూస్ వస్తోంది.

భోజనానికూర్చున్నాక చెప్పింది మా ఆవిడ గలగల్లాడుతూ. ఆవిడంతే మనిషి హుషారుగా ఉందంటే తెగ మాట్లాడుతుంది. అదే నాకు నచ్చదు.

"మీకు తెలిసిందా? ఆ తాడేపల్లిగూడెం దగ్గర బోరుబావిలో పడిపోయాడూ ఆ ముసలాయాన్ని బయటకు తీయగలిగారట. ఇప్పుడు బాగానే ఉన్నాట్ట. మధ్యాహ్నం పేపర్లో ఆయనా బోరుబావిలో పడిపోయాడని చదివిన దగ్గర్నుంచీ నా మనసు మనసులో లేదనుకోండి" చెప్తూనే ఉంది. ఠక్కున వారించాను.

"అందుకు ఎంత ఖర్చు చేశారో తెలుసా! అసలంత ఖర్చు చెయ్యడం అవసరమా? ఆ డెబ్బై ఏళ్ళవాడు బతికి ఏం ఉద్ధరిస్తాడట. అలాంటి వాడివల్ల మనకేంటి ప్రయోజనం? బొత్తిగా బుద్ధిలేకుండా పోతోంది ఈ జనానికి. ఇలాంటి పన్లకు ఎక్కడలేని డబ్బూ తగలేస్తున్నారు" అంటూనే ఉన్నాను.

మా ఆవిడ ముఖం ఎర్రగా అయిపోయింది.

"అలా లాభాల గురించీ నష్టాల గురించీ ఆలోచించి మరీ వ్యవహరించడానికి అంతా మీలా వ్యాపార దృష్టితోనే ఉండరులెండి. ఒక ప్రాణం విలువ కొంతమందికైనా తెలియబట్టే ఈలోకం ఇంకా ఇలా నిలిచిఉంది. అయినా మానవత్వం, అనుబంధాలూ, పెద్దల విలువా మీలాంటి వాళ్ళకేం తెలుస్తుందండీ. వృద్ధులు జాతి సంపద. వాళ్ళు అందించే ఆస్తులు డబ్బు రూపంలోనే ఉండక్కర్లేదు. వాళ్ళ అనుభవాలూ, అనుబంధాలూ, అభిమానాలూ, వాళ్ళ మాటా, మన్ననా అన్నీ ముందుతరానికి విలువ కట్టలేని ఆస్తులేనండీ" చెప్తూనే ఉంది.

రోజూ ఉండే సోదే కదా! చిరాగ్గా భోజనం త్వరత్వరగా ముగించుకుని బెడ్‌రూంలోకెళ్ళి, బెడ్ మీద వాలి టి.వి. ఆన్ చేసి, 'బిజినెస్ వాచ్' చూడడంలో మునిగిపోయాను. అలాగ అర గంట చూసి నిద్రలో మునిగిపోతాను. అది నా నిత్యకృత్యం.

★★★

ఎ.సి.వోల్వో బస్సు నిశ్శబ్దంగా చీకటిని చీల్చుకుంటూ పోతోంది. బయట వాతావరణం ఏమీ బాగా లేదు. కుంభవృష్టిగా వర్షం పడుతోంది. మబ్బులు బాగా కమ్ముకుని ఉండడంతో పౌర్ణమి రాత్రులయినా చిమ్మ చీకటి. అత్యవసరమైన పనిమీద నెల్లూరుకు బయల్దేరక తప్పలేదు. ట్రెయిన్ కోసం ట్రై చేశాను కానీ ఎ.సి.దొరకలేదు.

నెమ్మదిగా నిద్రలోకి జారుతున్నాను. అంతలోనే మెలకువ వస్తోంది. సగం మత్తు సగం మెలకువ. బస్ ప్రయాణంలో ఇదే బాధ. పూర్తిగా నిద్రపట్టి చావదు. మరో రెండు గంటలు కష్టపడితేనే నెల్లూరు చేరిపోతా.

గెస్టుహౌస్‌లో హాయిగా ఓ రెండు గంటలు విశ్రాంతి తీసుకోవచ్చు. ఉన్నట్టుండి హోరుమని శబ్దం. గొల్లుమని జనం గోల. ఉలిక్కిపడి పూర్తి మెలకువ లోకి వచ్చాను. చిమ్మచీకట్లో అసలేం జరుగుతోందో అర్థం కావడం లేదు.

కాళ్ళమీద చల్లగా ప్రవాహం. కుడిచేయి క్రిందకు పెట్టాను. నీళ్ళు ఎడమ చేత్తో చూశాను.

అటూ నీళ్ళే. నీళ్ళు..నీళ్ళు..నీటి మధ్యలోనేను. కాదు కాదు. బస్సులోని మేమందరం!

డ్రైవరు కాబోలు అరుస్తున్నాడు "నదికి వరద వచ్చినట్టుంది. బస్‌లోకి నీళ్ళొస్తున్నాయి. ఎక్కడి వాళ్ళక్కడే అద్దాలు పగలకొట్టి బయటపడండి".

వెంటనే అద్దాలు పగులుతున్న శబ్దాలు. నా పక్కనున్న వ్యక్తి కాబోలు నన్ను పక్కకు తోసి అద్దం మీద గుద్దుతున్నాడు. తేరుకుని నేనూ అద్దాల మీద దాడి ప్రారంభించాను.

అద్దాలు పగలడంతోనే నీళ్ళు నలుమూలల నుంచి ఉధృతంగా బస్సును ఆక్రమించుకుంటున్నాయి.

గుండెల నిండా ఊపిరి పీల్చుకుని గుండెనిండుగా గాలి పీల్చుకుని పక్కవాడిని గెంటి అద్దం పగిలిన కిటికీ లోంచి అతి కష్టం మీద బయట పడ్డాను. నా బేగ్‌తో సహా. చుట్టూ నాలాంటి వాళ్ళే హాహాకారాలు చేస్తూ నీళ్ళ ఒరవడి క్షణ



క్షణానికీ పెరుగుతోంది. నడుం దాటి వస్తున్నాయి. దారీ తెన్నూ కనబడడం లేదు. ఎటుపోతే గట్టు చేరతామో తెలియదు. నీళ్ళేమో మనిషిని కబళిం చేలా దాడి చేస్తున్నాయి. లక్షల కోట్ల బిందువుల సమూహ ప్రవాహ బలం ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాను.

ఎవరో బ్యాటరీ లైటు వెలిగించారు. అటు చూశాను. నీటి ఒరవడికి బస్సు తలక్రిందులైంది.

ఒక పల్టీ కొట్టింది. రెండు..మూడు..నాలుగు పల్టీలు. అంతే ఇక బస్సు కనబడలేదు. నా శరీరం జలదరించింది. నా పరిస్థితీ అంతేనా? అలాగే కొట్టుకుపోయి ఎక్కడో ఒకచోట దిక్కులేని శవాన్నై తేలుతానా? ఎక్స్‌గ్రేషియా కోసం వేసే లెక్కల్లో మరో అంకె నౌతానా?

జనం అరుపుల స్థాయి ఉన్నట్టుండి పెరిగింది. ఇటు తల తిప్పాను. తెల్ల వార వస్తున్నట్టుంది.

మసక వెల్తుర్లో మావైపే వస్తూ దూరంగా ఉన్న ఓ బోటు కన్పించింది. నా గుండెలు ఆనందంతో ఒక్కసారి ఎగసిపడ్డాయి. హమ్మయ్య బతికి బయట పడ్డట్టే. నన్ను రక్షించడానికి వచ్చేస్తున్నారు.

అప్పటికే నీళ్ళు భుజాలు తాకుతున్నాయి. నీళ్ళు ప్రవాహపు ధాటికి కాళ్ళ బాలెన్సు తప్పుతున్నాయి. బాగ్ పొట్టకి బిగించి కట్టుకుని దాన్ని ఆధారంగా చేసుకుని చేతులు బారచాచి మునిగిపోకుండా తేలుతూ ఈదడానికి ప్రయత్నిస్తున్నాను.

బోటు దగ్గరగా వచ్చేసింది. నలుగురు మనుషులు నీటిలోకి దూకారు గజ ఈతగాళ్ళలా ఉన్నారు.

మా వైపే ఈదుకుంటూ వస్తున్నారు. మా బస్‌లో వాళ్ళు ఓ పదిమంది వరకూ నా ముందున్నారు.

వీళ్ళందరి కంటే ముందుగా నేను వాళ్ళ కంట పడాలి. వాళ్ళు నన్ను రక్షించాలి.

పక్కనున్న వాడ్ని తోసుకుంటూ ముందుకు కదిలాను. వాడు పాపం పల్టీ కొట్టాడు.

నీళ్ళు నోట్లోకి పోయినట్టున్నాయి. గుటక లేస్తున్నాడు. చస్తే చావనీ! ఉదయానికి వందమంది ఈ వరదలో చస్తే అందులో వీడొకడు!

వీడివల్ల ఏం ప్రయోజనం? బతికితే నాలాంటివాడు బతకాలి!

నా చొరవ వృధా అయిపోయింది. నా చేరువవుతున్న ఈతగాడు గభాల్న అటు తిరిగాడు.

మునిగిపోతున్న వాడ్ని వీపు మీద చేర్చుకుని బోటు వేపు వేగంగా ఈదుతున్నాడు.

రెండో వాడూ అంతే. మరో ఇద్దరి చేతులందుకుని బోటు వైపు గుంజుకు పోతున్నాడు.

ఇక లాభం లేదు. అరిచాను. చేతులూపాను. మొత్తుకున్నాను. ఏం ప్రయోజనం లేదు. దగ్గరదాకా వచ్చిన వారే నా ముఖంలోకి చూశాక ఏమవుతుందో ఏమో అటు పక్కకు తిరిగిపోతున్నారు. మరొకరికి ఆపన్న హస్తం అందిస్తున్నారు.

నాకు ఉక్రోషం ముంచుకొస్తోంది. ఏడుపొస్తోంది. నీటి ఉధృతి పెరిగిపోతోంది. బ్యాగు నీళ్ళు పీల్చుకున్నట్టుంది. కిందకు గుంజేస్తోంది. కాళ్ళలో. చేతుల్లో శక్తి తగ్గిపోతోంది.

అప్పుడే నా ముందుకి ఈతగాడు నా పక్కనున్న వాడికోసం చెయ్యి అందివ్వబోతున్నాడు.

వాడి చెయ్యి అంది పుచ్చుకోవాలని ప్రయత్నాలు సాగించాను. తప్పించుకుంటూ వాడు.

"ఏం నన్ను బతికించవా?" అరిచాను.

వెటకారంగా నవ్వాడు వాడు. "నువ్వు బతికి ఏం ప్రయోజనమోయ్. అన్ని రుచులూ చూసినవాడివి. సగం బతుకు బతికేసిన వాడివి. అవతలి వాడిని చూడు. నూనూగు మీసాల వాడు. ఇంకా జీవిత మంటేనే తెలియని వాడు. బతికిస్తే అలాంటి వాడిని బతికించాలి. అయినా నిన్ను బతికిస్తే నాకేం లాభం? ఈ లోకానికేం ప్రయోజనం?"


నాకు అహం పొడుచుకునొచ్చింది "నేను డబ్బున్న వాణ్ణిరా" అరిచాను.

హేళనగా నవ్వాడు ఈతగాడు "ఇంకేం ఆ డబ్బునే కాపాడమను" అనేసి అటు తిరుగుతున్నాడు.

వాడి కాలు అందింది పట్టుకున్నాను.


"నేను ఆఫీసర్ని బాబూ" నా గొంతులో వణుకు

ఇంకా హేళనగా నవ్వాడు వాడు.



## సంకొత్త నిర్ణయం

మమతా మోహన్‌దాస్ గాయని కమ్ నటి అని అందరికీ తెలిసిందే. హస్కీ వాయిస్‌తో ఎక్కువగా ఐటమ్ నంబర్లు పాడే మమతా ఇకపై తను నటించే సినిమాలో మాత్రమే పాడతానంటోంది. తను నటించకపోయినా ఆ సినిమాలో పాటలు పాడమని అడిగేవారికి కాస్త నిరుత్సాం కలిగించే మాట ఇది కదా! హీరోయిన్‌గా బిజీ అవుతున్నందునే మమత ఈ నిర్ణయం తీసుకుందని సినీవర్గాలు చెప్పుకుంటున్నారు.



నా కడుపుదేవేసినట్టయింది. అయినా తప్పదు మరి. దీనంగా చూస్తున్నాను.

"ఆఫీసరువా. కొంపతీసి ఫలానా ఆఫీసరువి కాదు గదా?"

నాకళ్ళు వెలిగాయి. ఇక ఫర్వాలేదు. నా పరపతి వీడికి తెలుసు. వీడు నన్ను కాపాడతాడు. అందుకే ఆత్రంగా "అవును" అన్నాను.

కాలు విదలించుకున్నాడు వాడు.

దొరికిన పట్టు వదిలిపోవడంతో ఒక్క గిరికీ కొట్టాను. అతికష్టం మీద పైకి తేలిన నాతో అన్నాడు.

"నువ్వు మనిషివి కాదు. కేవలం కొవ్వుపట్టి అహం పెంచుకున్న ఆఫీసరువి. నీలాంటి ఆఫీసర్లకేం కొదువ. ఒకడు తగ్గినా తగ్గినట్లే..అవునూ ఇన్స్యూరెన్సు చేశావా?"

ఇదేం ప్రశ్న ఈ పరిస్థితిలో? కొంపతీసి ఇన్స్యూరెన్సు ఏజెంటా వీడు?

అయినా చెప్పాను. "చేశాను. ఓ రెండు కోట్ల దాకా" ఒకవేళ ఇన్స్యూరెన్సు ఏజంటే అయితే కంపెనీకి నష్టం రాకూడదనైనా నన్ను కాపాడుతాడనుకుంటూ.

వికటంగా నవ్వాడు వాడు.

"ఇంకేం నువ్వు చస్తే నీ కుటుంబానికి ఆ రెండు కోట్లూ వస్తాయి. ఉద్యోగంలో ఉన్నప్పుడే చచ్చావు గనుక ప్రభుత్వం బోలెడిస్తుంది. నీ కూతురుకో, పెళ్ళానికో ఓ ఉద్యోగమూ దొరుకుతుంది. వరదలో ఛస్తున్నావు కనుక ఎక్స్‌గ్రేషియా అదనం. నువ్వు ఛస్తేనే లాభం" వెళ్ళిపోయాడు ఆ కుర్రాడ్ని భుజం మీద వేసుకుని.

అందరూ బోటులోకి చేరిపోయారు. బోటు వెనక్కు తిరుగుతోంది. నన్నొక్కడ్నీ వదిలేసి.

అంతా అయిపోయింది. ఇక నేను చచ్చిపోవాల్సిందేనా? నన్నెవ్వరూ కాపాడరా? నేనెవరికీ అక్కర్లేదా? నా ప్రాణానికి విలువే లేదా?

సిగ్గు విడిచేశాను. అరుస్తున్నాను. ఆక్రోశిస్తున్నాను.

"నన్ను బతికించరూ. మీ కాళ్ళు పట్టుకుంటాను. మీ దాసుణ్ణయి బతుకుతాను బాబూ నన్ను మన్నించండి" నా ప్రాణం కాపాడండి. అలా అరుస్తూనే ఉన్నాను. అరణ్యరోదనే అయిపోతోంది. బోటు క్షణ క్షణానికీ దూరమై పోతోంది.

ప్రవాహం గొంతుదాటి పైకొచ్చింది నోటివరకూ నోట్లోకి నీళ్ళు పోతున్నాయి.

భయంతో కనుగుడ్లు పేలిపోతాయా అన్పిస్తోంది. కళ్ళు గట్టిగా మూసేసుకున్నాను.

★★★

భుజం మీద ఎవరిదో చెయ్యి పడింది.

"ఏమైంది? ఎందుకలా అరుస్తున్నారు?" మా ఆవిడ మాట విన్పిస్తోంది. కళ్ళు తెరిచాను.

నేను నా బెడ్ మీదనే ఉన్నాను. ఎదురుగా మా ఆవిడ.

గుండె కదలిక సాధారణ స్థాయికి చేరి తేరుకున్నాను. కలలో అన్న మాట నా అనుభవాలన్నీ!

విచిత్రంగా, కొంచెం అనుమానంగా చూస్తూ మళ్ళీ అడిగింది మా ఆవిడ "ఏమైంది?"

"ఉదయం అయింది" అన్నాను మెల్లగా.

చిరాగ్గా చూసింది వెళ్ళిపోయింది వంటింట్లోకి

లేచి బాత్రూంలోకి వెళ్ళాను. బ్రష్ పట్టుకుని అలవోకగా చూశాను.

బకెట్లో చీమ..కండ చీమ..నీళ్ళ మధ్య ఆందోళనగా కదలాడుతోంది. నెమ్మది నెమ్మదిగా మునిగిపోతోంది.

అప్రయత్నంగా బ్రష్ పారేసి చేయి బకెట్లో ముంచి అరచేతితో దాన్ని అందుకున్నాను. భద్రంగా హాలులోకి తెచ్చి టీ పాయ్ మీద వదిలాను.


ఒకటి, రెండు, మూడు..ముప్ఫై క్షణాల అనంతరం చైతన్యవంతమైంది చీమ..నెమ్మదిగా..నెమ్మది నెమ్మదిగా.

ఆనందం..ఎంత ఆనందం..గుండెలనిండుగా ఆనందం. ఒక ప్రాణం నిలపడంలో ఎంత సంతృప్తి!

ఎప్పుడొచ్చిందో ఏమో మా ఆవిడ నా వెనుకే ఉంది. అంతా చూసినట్టే ఉంది. వెచ్చగా ఓ ముద్దు పెట్టింది నా బుగ్గమీద.

అవునూ... మా నారాయణకి ఎట్లా ఉందో? అప్పారావుకి వెంటనే ఫోన్ చేసి కనుక్కోవాలి!

★



## గ్రేట్ డక్ రేస్

సింగపూర్ నదిలో ఇటీవల డక్ రేస్ జరిగింది. త్వరలో ఈ నది మరీనా బేరేజ్ ప్రాజెక్టుగా తయారుకానుంది. ఈ ఆఖరి రేస్‌లో 85,000 రబ్బరు బాతులు పాల్గొన్నాయిట. దీనిమీద వచ్చిన ఆదాయాన్ని వివిధ సేవా సంస్థలకు పంచుతారుట.

-విమలారామం

